# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 28-12-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- పూర్వ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు ఈరోజు ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో ముగిశాయి.

- క్యాబ్ అగ్రిగేటర్లు మధ్య వ్యత్యాస ధరల్లో వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేపట్టాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి జాతీయ వినియోగదారుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (CCPA)ని ఆదేశించారు.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

- ఆస్ట్రేలియా - భారత్ పరుషుల జట్ల మధ్య జరుగుతున్న 4వ టెస్టు క్రికెట్ మ్యాచ్ లో ఈరోజు ఆట ముగిసే సమయానికి భారత్ 358 పరుగులు చేసింది.

========================

పూర్వ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు ముగిశాయి. ఢిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో ఆయన పార్థివదేహానికి ఈరోజు ప్రభుత్వ లాంఛనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. సిక్కు పూజారులు మన్మోహన్ సింగ్ కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు ముందు గుర్బానీ నుండి శ్లోకాలు పఠించారు. ఉత్సవ గురువుల గౌరవానంతరం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, కిరణ్ రిజిజు... మన్మోహన్ సింగ్ పార్థివదేహం వద్ద పుష్పాంజలి ఘటించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్టీ నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా హాజరై మాజీ ప్రధానికి తుది వీడ్కోలు పలికారు. త్రివిధ దళాల అధిపతులు మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించారు. అంత్యక్రియలకు దిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, బీఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ హాజరయ్యారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యల్ వాంగ్‌చుక్, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. మన్మోహన్ సింగ్ అంతిమ యాత్ర కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం నుంచి నిగమ్ బోధ్ ఘాట్ వద్ద శ్మశాన వాటిక వరకు కొనసాగింది. అంతకుముందు, ఆయన భౌతికకాయాన్ని ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ప్రజలు, పార్టీ కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు.

=========================

క్యాబ్ అగ్రిగేటర్లు మధ్య వ్యత్యాస ధరల్లో వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేయాలని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి జాతీయ వినియోగదారుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (CCPA)ని ఆదేశించారు. క్యాబ్ అగ్రిగేటర్లు ఒకే ప్రయాణానికి సంభందించి యాప్‌లతో పాటు, పలు ఇతర మొబైలు ఫోన్లలో వేరు వేరు ఛార్జీలను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి వీలైనంత త్వరగా నివేదిక సమర్పించాలని సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీని CCPAని కోరినట్టు సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. అలాగే ఫుడ్ డెలివరీ, ఆన్‌లైన్ టిక్కెట్ బుకింగ్ యాప్‌లతో పాటు, ఇతర యాప్ లను కూడా పరిశీలించాలని CCPAని కోరారు. వినియోగదారుల దోపిడీని ప్రభుత్వం ఏమాత్రం సహించదబోదని కేంద్రమంత్రి స్పష్టం చేశారు.

=========================

పాకిస్తాన్, ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దు ప్రాంతాలలో ఇరు దేశాల సైనికుల మధ్య జరిగిన భారీ ఘర్షణలలో ఈరోజు 22 మంది మరణించారు. తూర్పు ఆఫ్ఘనిస్తాన్ ఖోస్ట్, పాకిస్తాన్ లోని పాక్‌టికా ప్రావిన్స్ సరిహద్దులో ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దులో ఉన్న బలగాలు ఖోస్ట్ ప్రావిన్స్‌లోని అలీ షిర్ జిల్లాలో పలు పాకిస్థాన్ సైనిక స్థావరాలను కాల్చివేయడంతో 19 మంది పాకిస్తాన్ సైనికులు చనిపోయారు. దండ్-ఎ-పటాన్ జిల్లాలో పాకిస్థాన్ సైనికులు చేసిన కాల్పులలో ముగ్గురు ఆఫ్ఘన్ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం రాత్రి పాక్టికా ప్రావిన్స్‌లో పాక్ సైనికులు జరిపిన వైమానిక దాడులతో ప్రారంభమైన ఈ ఘర్షణలలో ఇప్పటివరకు మహిళలు, పిల్లలు సహా 51 మంది మరణించారు.

=========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 117వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” తెలుగు అనువాదం ప్రధానమంత్రి ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, తిరిగి రాత్రి 8 గంటలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

=========================

అయోధ్యలో బాలరాముడు కొలువుదీరి సంవత్సరం పూర్తి కానున్న తరుణంలో భారీగా భక్తులు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే దర్శన వేళలు పెంచుతూ రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ నిర్ణయం తీసుకుంది. “రాముడి ఆలయం, హనుమాన్‌గఢి, లతాచౌక్, గుప్తర్ ఘాట్, సూరజ్ కుండ్, ఇతర ప్రఖ్యాత స్థలాల వద్ద భారీగా భద్రతా ఏర్పాటు చేశామని అయోధ్య పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 22న అయోధ్య రామమందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ అత్యంత వైభవంగా జరిగింది.

విరామం

=========================

జమ్మూకశ్మీర్‌లో భారీగా మంచు కురుస్తున్న నేపథ్యంలో శ్రీనగర్-జమ్మూ జాతీయరహదారి, మొఘల్ రోడ్డును మూసివేశామని అధికారులు పేర్కొన్నారు. మంచు విపరీతంగా కురుస్తుండటంతో జమ్మూకశ్మీర్‌లోని పలు ప్రాంతాల రవాణా సర్వీసులకు అంతరాయం కలిగినట్లు అధికారులు పేర్కొన్నారు. రైల్వే ట్రాక్‌లపై భారీగా మంచు పేరుకుపోవడంతో బనిహాల్ - బారాముల్లాల మధ్య పలు రైళ్లను రద్దు చేశామని రైల్వే శాఖ పేర్కొంది. వాతావరణ పరిస్థితుల్లో మార్పు కారణంగా శ్రీనగర్‌కు వెళ్లే విమానాలను రద్దు చేసినట్లు ఇండిగో ఎయిర్‌లైన్స్ తెలిపింది. మరోవైపు కశ్మీర్ విశ్వవిద్యాలయం పరిధిలో ఈరోజు జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేసినట్లు విద్యాశాఖాధికారులు పేర్కొన్నారు. మంచు కారణంగా స్థానిక ప్రజలు, పర్యటకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

అలాగే భారీ హిమపాతం కారణంగా కార్గిల్‌ను శ్రీనగర్‌తో అనుసంధానించే రెండు జాతీయ రహదారులను మూసివేశారు. అన్ని ప్రధాన రహదారులను వీలైనంత త్వరగా సరిచేస్తామని కార్గిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ సూసే హామీ ఇచ్చారు. పరిస్థితిని పర్యవేక్షించడానికి, ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలియజేశారు.

=========================

సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థను నవ్యపథంలో నడిపించిన మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు సముచిత గౌరవం ఇచ్చేందుకు ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని భారతీయ జనతా పార్టీ పార్లమెంటు సభ్యులు, ఆ పార్టీ అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది అన్నారు. ఈరోజు ఆయన ఢిల్లీలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ, మన్మోహన్ సింగ్ జ్ఞాపకార్థం స్మారక చిహ్నం నిర్మించాలని మంత్రివర్గ సమావేశం నిర్ణయించిందని, ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీకి తెలియజేశామని అన్నారు. భూసేకరణ, ట్రస్ట్ ఏర్పాటు, భూ బదలాయింపు వంటి ప్రక్రియలు పూర్తయిన తర్వాత స్మారక చిహ్నం నిర్మించాలన్న ప్రభుత్వం నిర్ణయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు తెలియజేసినట్లు ఆయన తెలిపారు. వీలైనంత త్వరగా దీనిని పూర్తి చేస్తామని ఆయన వివరిస్తూ...

(వాయిస్ 39 సెకన్లు)

=========================

వాతావరణ మార్పులు ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయని, ఈ నష్టాలను అంచనా వేయడానికి తగిన ఉపశమన చర్యలను అమలు చేయాల్సిన అవసరం ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) డిప్యూటీ గవర్నర్ ఎం. రాజేశ్వర్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపే వాతావరణ మార్పు ప్రమాదాలను అంచనా వేయడానికి, తగ్గించడానికి రిజర్వ్ బ్యాంక్ చర్యలు చేపడుతుందన్నారు.

=========================

మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియా - భారత్ పురుషుల జట్ల మధ్య జరుగుతున్న నాలుగో టెస్టు క్రికెట్ మ్యాచ్ లో 3వ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 116 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 358 పరుగులు చేసింది. ఈ క్రమంలో ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన నితీశ్ కుమార్ టెస్టు కెరీర్‌లో 171 బంతుల్లో 105 పరుగులు చేసి తొలి శతకం సాధించాడు. దీంతో ఆస్ట్రేలియాలో 8వ స్థానంలో వచ్చి అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఇంకా భారత్ 116 పరుగులు చేయాల్సి ఉంది.

కాగా టెస్ట్ మ్యాచ్‌లో అతిపిన్న వయసులో సెంచరీ చేసి మూడో భారత ఆటగాడిగా ఘనత సాధించిన నితీష్ కుమార్ రెడ్డి ఆట తీరుపట్ల దేశ వ్యాప్తంగా ప్రసంసలు వెల్లువెత్తుతున్నాయి. మెల్‌బోర్న్ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్ లో శతకం సాధించిన నితీష్ కుమార్ ఆట తీరు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు. భవిష్యత్తులో నితీష్ మరిన్ని విజయాలు సాధించాలని.. భారత జట్టులో కొనసాగి కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా అని చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

=========================

అమెరికా అధ్యక్షులు జో బైడెన్ పూర్వ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతి పట్ల తన సంతాపాన్ని తెలియజేశారు. మన్మోహన్ సింగ్ కుటుంబసభ్యులకు బైడెన్ దంపతులు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ... వైట్‌హౌస్ ఓ ప్రకటన విడుదల చేసింది.

=========================
=========================